క్లుప్తంగా

సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలి



కుమ్మపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు లబ్ధిదారులు సిద్ధం కావాలని మండల ప్రత్యేకాధికారి పి.ఎస్.ఎన్.లక్ష్మీనారాయణ కోరారు. హౌసింగ్ డే సందర్భంగా శుక్రవారం కుమ్మపల్లి గ్రామంలో నిర్వహించిన హౌసింగ్ డే లో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఏమైనా సొమ్ము అవసరమైతే ఐకేపీ ద్వారా రుణం పొందవచ్చునని తెలిపారు. ఇసుక, సిమెంటు అందుతున్నాయా అని ఆరా తీశారు. నిర్మాణాల్లో జాప్యానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు పేమెంటు చేసేందుకు అవసరమైన సొమ్ము సిద్ధంగా వుందని, లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసి బిల్లులు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీనివాసన్, ఏఈ అప్పలనాయుడు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు ఉపాధి ఏపీఓ సన్యాసినాయుడు, విద్యుత్ శాఖ ఏఈశ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహిళ మృత అవశేషాలపై క్లూస్ టీమ్ పరిశీలన

భామిని: మండలంలో సంచలనం రేపిన మహిళ మృత అవశేషాల లభ్యతపై వివరాలు సేకరించడానికి బత్తిలి ఎస్సై వై.అమ్మన్‌రావు ఆధ్వర్యంలో క్లూస్ టీం శుక్రవారం రంగంలోకి దిగింది. ఈ మేరకు భామిని మండలం కొరమ సమీపంలో గురువారం గుర్తించిన మహిళ మృతదేహం ఆనవాళ్లను పరిశీలించి ఆధారాలు సేకరించారు. పెద్దదిమిలి వీఆర్‌ఓ పి.వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘటనా స్థలంలో అవసరమైన వివరాలు తీసుకున్నారు. మృతురాలు ఎవరు? ఎలా మృతి చెందింది? హత్యా? ఆత్మహత్యా? అనే విషయాలు తెలుసుకునేందుకు క్లూస్‌టీం శ్రమించింది. అయితే వేరే చోట హత్య చేసిన కొన్నాళ్లకు ఇక్కడికి తెచ్చి పడవేశారనే అనుమానాలు ఎక్కువగా రేగుతున్నాయి. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచిన అవశేషాలను క్లూస్ టీమ్ పరిశీలన అనంతరం డీఎన్‌ఏ పరీక్షకు విజయవాడ పంపుతున్నట్లు ఎస్సై అమ్మన్‌రావు తెలిపారు. మృతురాలు చీర, వయస్సు, జుత్తును పరిశీలించి శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మెట్టూరు బిట్-2కు చెందిన వివాహిత రంజితగా భావిస్తున్నారు. గత నెల-1 తేదీన భామిని మండలం పెద్దదిమిలి గ్రామానికి వచ్చి బంధువుల ఇంటికి వచ్చి తిరిగివెళ్లే సమయంలో ఆమె అదృశ్యమైనట్లు భర్త ఫిర్యాదు చేసి ఉన్నాడు. రంజిత వచ్చిన పెద్దదిమిలి గ్రామానికి అవశేషాలు లభించిన కొరమ గ్రామానికి మధ్య మూడు కిలోమీటర్ల దూరం కావడంతో అనుమానాలు బలపడుతున్నాయి.



మృతురాలి అవశేషాలను ఆస్పత్రిలో పరిశీలిస్తున్న క్లూస్ టీం

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులకు దుస్తులు వితరణ

చీపురుపల్లి రూరల్(గరివిడి): మండలంలోని వెదుల్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థులకు తాలాడ సత్యం జ్ఞాపకార్థం ఆయన కుమారులు తాలాడ సోమేశ్వరరావు, తాలాడ శంకరరావు దుస్తులను శుక్రవారం పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాన్ని చేయాలనే ఉద్దేశంతోనే వస్త్రాలను అందజేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ వెంకటరావు, సహోపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో పడి వలంటీర్ మృతి



సింహాచలం (ఫైల్)

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస పంచాయతీ పరిధి గున్న తోటవలసకు చెందిన వలంటీర్ కంటు సింహాచలం(38) చెరువులో పడి మృతిచెందాడు. ఈ ఘటనపై ఎస్సై జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 11న బొబ్బిలిలోని సచివాలయ ఉద్యోగి వివాహవేడుకకు హాజరైన సింహాచలం తరువాత అదృశ్యమయ్యాడు. దీనిపై కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బొబ్బిలి పట్టణంలోని కోటిచెరువు కాలువలో ఓ వ్యక్తిమృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి పరిశీలించి ఆ మృతదేహాన్ని వలంటీర్ సింహాచలంగా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహానికి సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించారు. వలంటీర్ సింహాచలం ప్రమాదవశాత్తు చెరువులో పడిమృతిచెందినట్లు భావిస్తున్నారు. మృతుడికి భార్య శోభారాణి, కుమార్తె శ్రీవల్లి, కుమారుడు లోహిత్‌కుమార్‌లు ఉన్నారు. కుటుబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండ ప్రాంతంలో మృతదేహం లభ్యం

కురుపాం: మండలంలోని కరండిగూడ-సొబ్బాకొండల్లో మృతదేహం ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న ఎల్విన్‌పేట సీఐ బి.సత్యనారాయణ, నీలకంఠాపురం ఇన్‌చార్జ్ ఎస్సై సీహెచ్ ప్రసాద్ సిబ్బంది కలిసి గురువారం రాత్రి సంఘటనా స్థలానికి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానికులను ఆరా తీయగా ఎయిర్‌టెల్ టవర్ నిర్మాణం పనుల నిమిత్తం జార్ఖండ్‌రాష్ట్రం నుంచి ఇక్కడికి ఆ వ్యక్తి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి దగ్గర ఉన్న ఆధార్ కార్డు ప్రకారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బుధహెబందరం (51)గా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతిచెందిన బుధహెబందరం

స్టోన్ క్రషర్‌లో కార్మికుడి మృతి

కురుపాం: స్థానిక బాలాజీ స్టోన్‌క్రషర్‌లో జరిగిన ప్రమాదంలో కార్మికుడు ఆర్.సూర్యనారాయణ (55) మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం కొంకిడివరం గ్రామానికి చెందిన ఆర్.సూర్యనారాయణ(55) సుదీర్ఘకాలంగా క్రషర్‌లో లోడింగ్ చేసే చోట యూనిట్ గేజ్ చూస్తున్నాడు. రోజు లాగానే పనిచేస్తుండగా వాహనానికి లోడింగ్ యంత్రం మధ్యలో నలిగిపోయి నేలకూలిపోయాడు. అది గమనించిన క్రషర్ సిబ్బంది హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదంలో మృతిచెందిన సూర్యనారాయణ

పశువుల లారీ పట్టివేత

కొత్తవలస : నిబంధనలు విరుద్ధంగా పశువులను లారీలో హైదరాబాద్ తరలిస్తుండగా కొత్తవలస పోలీసులు మాటు వేసి శుక్రవారం పట్టుకున్నారు. సీఐ ఎస్. బాలసూర్యారావు తెలిపిన వివరాలు... ఒడిశా రాష్ట్రం గుమడ సంత నుంచి ఒకే లారీలో 40కు పైగా ఆవులు, దూడలను హైదరాబాద్ తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు తమ సిబ్బందితో స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో మాటు వేయగా లారీ పట్టుబడినట్లు తెలిపారు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. లారీలో పశువులను కంటకాపల్లి గ్రామం శివారులో గల గోకులానికి అప్పజెప్పినట్టు తెలిపారు.

బాధితులకు సాయం

దత్తిరాజేరు: మండలంలోని భూర్జవలసలో కొద్ది రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు సామగ్రి అందజేసినట్లు రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి ఎం.రాము శుక్రవారం తెలిపారు. బాధితులు బెజవాడ పాపమ్మ, అప్పలనర్సమ్మలకు దుప్పట్లు, ఆయిల్, స్టీల్ సామగ్రి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యువత వలంటీర్లు పాల్గొన్నారు.

ఆ ఫిర్యాదులో వాస్తవం లేదు...

● విచారణ అనంతరం వెల్లడించిన అధికారులు

లక్కవరపుకోట: మండలంలోని రంగాపురం గ్రామంలో గల అంగన్‌వాడీ కార్యకర్త నక్క పార్వతీపై ఆయా ఆవాల రమాదేవి చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని మండల ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు, వియ్యంపేట ప్రాజెక్టు సీడీపీఓ రొంగలి ఉమాదేవి తెలిపారు. ఈ మేరకు అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి తనపై హత్యాయత్నానికి పాల్పడిందని, పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం అందించడం లేదని, నీళ్ల పాలు ఇస్తున్నారని, కేంద్రాన్ని సకాలంలో తెరవడం లేదని తదితర అంశాలతో కలెక్టర్ స్పందనకు ఆయా రమాదేవి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మండల ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు, సీడీపీఓ ఉమాదేవి, ఎస్ఐ ముకుందరావు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ పెద్దలు అంగన్‌వాడీ చిన్నారుల తల్లిదండ్రుల సమక్షంలో శుక్రవారం విచారణ నిర్వహించారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి పనితనం మెరుగ్గా వుందని, కేంద్రం నిర్వహణలో ఎటువంటి అవకతవకలు జరగడం లేదని చిన్నారుల తల్లిదండ్రులు స్పష్టం చేశారు. కాగా కార్యకర్త, ఆయాల మధ్య వ్యక్తిగత కారణాలతోనే ఫిర్యాదు చేశారు తప్ప ఆమె చేసిన ఫిర్యాదులో ఎటువంటి వాస్తవం లేదని గుర్తించామని అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు విచారణ నివేదికలను నివేదిస్తామన్నారు. విచారణలో గ్రామ సర్పంచ్ ఆవాల విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవాల సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ నిర్వహిస్తున్న మండల ప్రత్యేకాధికారి, సీడీపీఓ తదితరులు

శివరాత్రికి పుణ్యగిరి సిద్ధం

శంగవరపుకోట : శివరాత్రి జాతర కోసం పుణ్యగిరి సిద్ధమైంది. పుణ్యగిరి దేవస్థానం బోర్డు చైర్మన్ పి.రామకష్ణ నేతృత్వంలో భక్తులు కొండ దిగేందుకు ఏర్పాటు చేసిన కొండ దారిని పూర్తిగా సిద్ధం చేశారు. పలు చోట్ల చలివేంద్రాలు, తాత్కాలిక మరుగుదొడ్లు సిద్ధం చేయించారు. మెట్ల మార్గాన్ని పూర్తిగా శుభ్రం చేయించారు. దేవస్థానం ఈఓ నాగేంద్ర తదితర దేవదాయ శాఖ సిబ్బంది గడచిన వారం రోజులుగా పుణ్యగిరిలో వసతులు, సౌకర్యాలను సమీక్షిస్తూ పనులు వేగవంతం చేశారు. శనివారం ఉదయం మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో శివరాత్రి పూజలు ప్రారంభం అవుతాయని ఈఓ నాగేంద్ర తెలిపారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశామని, ఎక్కడ ఇబ్బందులున్నా భక్తులు తమ దృష్టికి తెస్తే వెంటనే వాటిని సరిదిద్దుతామని ఆయన చెప్పారు. శుక్రవారం నాటికి భక్తుల కోసం 10వేల లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశారు. శనివారం, ఆదివారం రెండు రోజులూ పులిహోర ప్రసాదాలను ఎప్పటికప్పుడు తయారు చేసేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మరో వంక దేవస్థానం బోర్డు సభ్యులు ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. ఎమ్మెల్సీ రఘురాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వై.వి.రమణి పుణ్యగిరిని శుక్రవారం సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ఆర్టీసీ అధికారులు శనివారం ఉదయం నుంచి పుణ్యగిరికి ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు.



భక్తుల కోసం సిద్ధం చేసిన లడ్డూ ప్రసాదం

ముస్తాబైన శివాలయాలు

దత్తిరాజేరు: మహాశివరాత్రి సందర్భంగా శివ పూజలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. కోమటిపల్లి, దత్తిరాజేరు, పోరలి, పెదమానాపురం, మరడాం, ఇంగిలాపల్లి రామచంద్రాపురం తదితర ఆలయాలలో శనివారం రాత్రి జరిగే జాగారాలకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

కళాశాలలో 'ఓపెన్ డే'

శృంగవరపుకోట : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం 'ఓపెన్ డే' కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సి.హెచ్.కేశవరావు నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న వసతులు, సౌకర్యాలు, కోర్సులు, ప్రత్యేక కోర్సులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి సర్వీసులు, డిజిటల్ క్లాసులు, జిమ్, లైబ్రరీ స్కిల్ డవలప్‌మెంట్ వంటి అన్ని అంశాలను వివరించి చూపారు. అన్ని వసతులు ఉన్న తమ కళాశాలకు ఇంటర్మీడియెట్ విద్యార్థులను పంపాలని కోరారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అన్ని వసతులు, అనుభవం ఉన్న ఉపన్యాసకులు ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులే కాకుండా నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు జాయిన్ కావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు తమ కళాశాల వసతులు, సౌకర్యాలను విద్యార్థులకు వివరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

కొత్తవలస రూరల్: గొల్లలపాలెం గ్రామంలో స్కూల్ విద్యార్థులతో నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ సబల సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. రైతులు తమ వద్ద ఉన్న మినుము, పెసలు, ఉలవలు, నువ్వులు, కందులు విత్తనాలతో పాటూ కాయగూర విత్తనాలు, చిరుధాన్యాల విత్తనాలను వరికి ముందు తొలకరిలో సుమారుగా 12 నుండి 18 రకాల విత్తనాలు ఎకరాకు 10 నుండి 12 కేజీల విత్తనాలు వేసినట్లయితే భూమికి ఉండే పోషకాలు పెరుగుతాయని వీఏఏ తేజ అన్నారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ కె.ఈశ్వరరావు, ఏఆర్ఎస్ నుండి ఏటలు రవి, రమణ, మాస్టర్ ట్రైనర్ కోటిబాబు, సీఏ స్రావ్య, ఐసీఆర్‌పీ భవానీ, స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అబద్ధపు ప్రచారం

● పచ్చమీడియా ప్రచారాన్నిఖండించిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ఎన్నికలు సమీపిస్తున్న వేళ పచ్చమీడియా అబద్ధపు ప్రచారాలు సాగిస్తోందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య విమర్శించారు. గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు 40 ఎకరాల భూమి ఉందని, అందులో ఎక్కువగా ఉన్నవి లిటిగేషన్ భూములేనంటూ పచ్చమీడియా చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టారు. పచ్చమీడియా ప్రతినిధులు తారసపడితే భూయజమానులైన రైతులే బుద్ధిచెబుతారన్నారు. తప్పుడు వార్తలతో ప్రజల్లోని తమ ఇమేజ్‌ను తగ్గించలేరన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ప్రజలకు ఏ నాయకుడు మంచి చేస్తారో తెలుసని చెప్పారు. బైపాస్ రోడ్డు మంజూరుచేసి ఈ ప్రాంత ప్రజల రాకపోకలు కష్టాలు తొలగిస్తే తప్పుడు కథనాలు ప్రచురించడం ఎంతవరకు సమంజసమన్నారు. బైపాస్ రోడ్డులో తమ భూమిని కూడా కొంత కోల్పోయినట్టు చెప్పారు. గజపతినగరంలో 30 పడకల ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు కృషిచేసినది ఎవరో ప్రజలకు తెలుసన్నారు. గజపతినగరంలో ఉద్యోగులందరూ చిత్తశుద్ధితో పని చేస్తున్నారని, వారి విధులపై అసత్యవార్తలు ప్రచురించడం తగదన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు గారతవుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, జేసీఎస్ కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, ఎం.గుమడాం సర్పంచ్ బొడ్డు రాంబాబు ఉన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

క్లుప్తంగా

ఇది కాదా.. కోడ్ ఉల్లంఘన



ఎల్.కోట బీసీ హాస్టల్ జంక్షన్ వద్ద ముసుగు లేకుండా వున్న ఎన్టీఆర్ విగ్రహం

లక్కవరపుకోట : ప్రస్తుతం ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో వుంది. దీంతో ఇప్పటికే పలు ప్రాంతాల్లో రాజకీయ పార్టీల, నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించారు. కాగా మండల కేంద్రంలో బీసీ హాస్టల్ జంక్షన్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత నందమూరి తారకరామారావు విగ్రహానికి మాత్రం అధికారులు ముసుగు వేయలేదు. దీంతో ఈ విషయమై పలువురు ఆక్షేపిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలు చేయాల్సిన అధికారుల అలసత్వాన్ని పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

విజయమే లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే కడుబండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అంతా కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గృహ సారథులు, సచివాలయ కనీ్వనర్లు, నాయకులు, కార్యకర్తలతో మండలంలోని చింతలపాలెం, దెందేరు, ఉత్తరాపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ సారథులు తమ పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, అర్హత ఉండి పథకాలు పొందని వారిని గుర్తించి పథకాల మంజూరుకు కృషి చేయాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి పాలనలో వ్యత్యాసాన్ని గుర్తించాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీని వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు ఆశీర్వదించేలా కోరాలని సూచించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్ కుమార్, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, మేలాస్త్రి అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీనివాసరావు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగాదికి సామూహిక గృహ ప్రవేశాలు



లబ్ధిదారులతో మట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి

బొండపల్లి: ఉగాదికి జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణదారులంతా సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీకే దుర్గాప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలో జగనన్న కాలనీలో లబ్ధిదారుల ఇళ్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. త్వరితంగా నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎంపీడీఓ ఎ.వేదవతి, ఈఓపీఆర్‌డీ సీహెచ్ సుగుణకరరావు, ఏపీఓ బి.కృష్ణవేణి, హౌసింగ్ ఏఈఈ రమణరాజు పాల్గొన్నారు.



పెట్రోల్ బంకు తనిఖీ



బంకులో పెట్రోల్ నిల్వను పరిశీలిస్తున్న తహసీల్దార్ తదితరులు

కొత్తవలస : మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఎంటర్‌ప్రైజెస్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్) పెట్రోల్ బంకులో తహసీల్దార్ డి.ప్రసాదరావు ఆధ్వర్యంలో నాణ్యత, కొలతలు తదితర అంశాలపై శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌కి ప్రస్తుతం ఉన్న నిల్వలను తనిఖీ చేశారు. వినియోగదారులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. మరుగుదొడ్ల నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సీఎస్‌డీటీ రమేష్ ఉన్నారు.

రుణాలు సద్వినియోగం కావాలి

- పీడీ కల్యాణచక్రవర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కల్యాణచక్రవర్తి

గంట్యాడ: స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి పేర్కొన్నారు. మండలంలోని బుడతానపల్లి గ్రామంలో స్వయం సహాయక సంఘాల పని తీరుపై శుక్రవారం ఆధ్యయనం చేశారు. గ్రామంలో గల సూర్య చంద్ర మహిళా పొదుపు సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. స్వయం సంఘాల సభ్యులు రుణాలు వినియోగించుకునే విధానం తదితర అంశాలపై వ్యక్తిగతంగా సంఘ సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, డీపీఎం బంగారమ్మ, ఏపీఎం శ్రీనివాస్, శైలేష్, సీసీలు చినబాబు, అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై ఆందోళన వద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

గంట్యాడ: పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థులు ఆందోళన చెందొద్దని డైట్ కళాశాల అధ్యాపకులు డి.ఈశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షా పర్వ్ అనే కార్యక్రమంపై శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణ, పట్టుదలతో చదివి విజయం సాధించడం సులువేనన్నారు. అవసరంగా ఒత్తిడికి గురికాకుండా యోగా, వ్యాయమం చేయడం ద్వారా ఒత్తిడిని జయంచవచ్చునన్నారు. ప్రశాంతంగా ఉంటే పరీక్షలను సులువుగా రాయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న బెల్లాన వంశీకృష్ణ

చీపురుపల్లి: మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని లైన్స్ స్టార్స్ క్లబ్ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ అన్నారు. లైన్స్ క్లబ్, లైన్స్ స్టార్స్ క్లబ్ నేతృత్వంలో పట్టణంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన శుక్రవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పావని, లైన్స్ క్లబ్ అధ్యక్షుడు కె.తవిటిరాజు, పాఠశాల హెచ్‌ఎం శ్యామలసాయి పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు



మెట్టపల్లిలో విద్యార్థి, తల్లిదండ్రులకు సూచనలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి

చీపురుపల్లి రూరల్: ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు దక్కుతాయని ఉప విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని మెట్టపల్లి గ్రామంలో గురువారం రాత్రి పదో తరగతి చదువుతున్న విద్యార్థులఇంటికి వెళ్లి ఎలా చదువుతున్నారో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు సమయం దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థులు ఆట, పాటలకు దూరంగా ఉండాలని, మొబైల్ వినియోగాన్ని తగ్గించాలని, తల్లిదండ్రులు కూడా పిల్లల చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఇప్పుడు నుంచి కష్టపడి చదివినప్పుడే పదో తరగతిలో మంచి మార్కులు సాధించగలుగుతారన్నారు.

వైభవంగా తీర్థ మహోత్సవం

వేపాడ: మండలంలోని ఎం.శింగవరంలో ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కుండల పోటీలు, బైక్ స్లో పోటీలు నిర్వహించారు.

అంకిత భావంతో పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: వృత్తి పట్ల అంకితభావంతో పని చేయాలని ఎంపీపీ పీరుబండి హైమావతి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో చర్చలు, తీర్మానాలు నిర్వహించకుండా సమావేశాన్ని ముగించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీడీఓ భవాని, ఈఓపీఆర్‌డీ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.